క్లుప్తంగా

సమస్యలపై తక్షణమే స్పందించాలి

పలాస: ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సిబ్బందితో మాట్లాడారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు పాల్గొన్నారు. గ్రామ స్థాయిలో చాలా సమస్యలు ఉన్నట్టు తన దృష్టికి వస్తున్నాయని.. ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ బి.సత్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు



బెల్లుపడ కాలనీలో పనులు చేపడుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జోరందుకున్నాయి. పట్టణాల్లో పారిశుద్ధ్య పనులు కొరవడిన వైనంపై 'వీధులు ఇలా ఉంటే వ్యాధులు ముంచెత్తవా? శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. దీంతో సోమవారం బెల్లుపడ కాలనీలో ఉన్న చెత్తడంపింగ్ ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రంచేసి బ్లీచింగ్ పౌడర్‌నుచల్లారు. రోడ్లపై నీరునిల్వలేకుండా ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌చార్జి ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గం

కంచిలి: మండలంలోని ప్రభుత్వ చౌకధరల దుకాణ డీలర్ల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ ఎంపిక ప్రక్రియను చేపట్టారు. అధ్యక్షునిగా కొత్తకోట నాగరాజు, ఉపాధ్యక్షునిగా పండి ప్రసాద్, కోశాధికారిగా బేసి శాంతి, ప్రధాన కార్యదర్శిగా దొప్ప నరేష్, సహాయ కార్యదర్శిగా సానా వెంకటరావు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం అంతా కలిసి స్థానిక తహసీల్దార్ జయలక్ష్మిని, సీఎస్‌డీటీ కూర్మారావు, ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ మహేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



డిపాజిట్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడి జగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల ధనలక్ష్మి కుటుంబానికి ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సోమవారం రూ.20 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది. ధనలక్ష్మి భర్త తిమ్మల అప్పలస్వామి ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడింది. చదువుతున్న ఇద్దరు కుమార్తెలను ఆర్థికంగా ఆదుకోవాలని తలచిన ఉద్దానం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు కీలు విజయకుమార్ తమ సంస్థ ద్వారా సాయాన్ని అందించారు. చిన్నారుల పేరున ప్రతి నెల రూ.500 పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్‌ను ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. సంస్థ ప్రతినిధులు కొయ్యల చంటి, బత్తిన మోహనరావు, రాజేష్ కన్నా, గర్తం పుష్ప, అర్జి గిరి, సోమేష్, జయరాం, రూప ఉన్నార.

ఎంఎంఎస్ అధ్యక్షురాలుగా భానుమతి

సంతబొమ్మాళి: మండల మహిళా సమైక్య సంఘ అధ్యక్షురాలిగా పంగ భానుమతి (చెట్లతాండ్ర) ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. ఈమెతో పాటు ఉపాధ్యక్షురాలుగా సీహెచ్ ఢిల్లేశ్వరి (మరువాడ), సెక్రటరీగా డి.వేణమ్మ (సంతబొమ్మాళి), జాయింట్ సెక్రటరీగా బి.హేమలత(వడ్డీతాండ్ర), కోశాధికారిగా డి.విజయలక్ష్మి (కొల్లిపాడు) ఎన్నికయ్యారు. ఏపీఎం టి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. నూతన కార్యవర్గాన్ని సీసీలు, వీవో అధ్యక్షురాలు, సభ్యులు అభినందించారు.

నూతన కార్యవర్గానికి అభినందనలు



యూనియన్ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: క్యాజు, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలియజేశారు. పలాస కార్మిక భవనంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాములను దుశ్శాలువలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర నాయకులు లోడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, నాయకులు సప్ప నవీన్, డొక్కరి శంకరరావు, దడియాల నరసింహమూర్తి, వంకల కూర్మారావు, కొత్త సత్యం, బద్రి గోపాల్, అవుగాన తిరుపతిరావు, మురపాల నాగయ్య ఉన్నారు.

● రక్తదానం



ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో సంతబొమ్మాళి మండలం భావనపాడులో రక్తదానం శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 53 యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు సాన ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఆరేళ్లగా సరైన సమయానికి రక్తం అందించడానికి స్వచ్ఛందంగా యువత ముందుకు రావడం సంతోషమన్నారు. గ్రామ యువత దుర్యోధన, సురేష్, రాజు, సాయికుమార్, ఆ నలుగురు ట్రస్ట్ సభ్యులు సానా ఈశ్వరరావు, టింక తేజేశ్వరరావు, మన్మథ, హేమసుందర్, విఘ్నేష్‌రాజు, నరేష్ పాల్గొన్నారు. –సంతబొమ్మాళి

● మొక్కలు నాటివేత



ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, నాషా ముక్తి భారత్ అభ్యాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లంతా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు ల్యాక్‌పాల్, డి.వాసుబాబు, కె.గొల్లతో పాటు అధ్యాపకులు ఎ.రామారావు పాల్గొన్నారు. – టెక్కలి

● విద్యుత్ ఏఈకి సత్కారం



పలాస విద్యుత్ డివిజన్ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్‌గా పైడి యోగేశ్వరరావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఆయన్ని విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (1104) పలాస డివిజన్ అధికారులు, ఉద్యోగులు ఈఆర్‌వో కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గార రాజారావు, గిరీశ్వరరావు, హిమగిరి, ప్రసాద్ పాణిగ్రాహి, రామచంద్రుడు ఉన్నారు. – కాశీబుగ్గ

జలకళ తప్పిన చెరువులు..!

- అందని వంశ'ధార'!
- ప్రశ్నార్థకంగా ఖరీఫ్ సాగు
- సాగునీటి కోసం రైతన్న ఎదురు చూపు



వంశధార నీరు అందని కొత్తూరు చెరువు



జల కళ తప్పిన కిడిసింగి ఎర్ర చెరువు

వజ్రపుకొత్తూరు రూరల్: అన్నదాతను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. పాలకులు మారినప్పటికీ తమ కష్టాలు మాత్రం తీరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆశతో ఖరీఫ్ సాగు చేస్తున్న తమకు ఏటా సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి చివరికి పంట నష్టాలను సవిచూస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎంతో ఆశతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు శివారు భూములకు వంశధార నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారి మాటలను నమ్మిన రైతులు ఎన్నో ఆశలతో సాగుకు సిద్ధమయ్యారు. పెట్టుబడులు పెట్టి దుక్కులు చేశారు. విత్తనాలు వేసి నారు మడులను సిద్ధం చేసుకున్నారు. కొంతమంది వెద పద్ధతిలో వరిని సాగు చేస్తున్నారు. అయితే ఈ తరుణంలో ఆశించిన స్థాయిలో వంశధార నీరు అందలేదు. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించకపోవడంతో రైతులు భవిష్యత్‌ను తలచుకొని ఆందోళన చెందుతున్నారు.

నిండని చెరువులు

కొంత కాలంగా వర్షాల్లేక భూగర్భ జలాలు అడుగంటాయి. గత నెలలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు చెరువుల్లో స్వల్పంగా మాత్రమే నీరు చేరింది. అయినప్పటికీ సాగునీటి చెరువులు జల కళ తప్పాయి. కనీసం వంశధార నీరు అందక బోరు మంటున్నాయి. అడుగంటిన చెరువుల వైపు రైతులు దిగులుగా చూస్తున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన మాట ప్రకారం శివారు గ్రామాలకు వంశధార నీరు అందిస్తామని మాట ఇచ్చి నెలలు దాటుతున్నా తమ చెరువులకు చుక్క నీరు చేరలేదని వాపోతున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని వంశధార శివారు గ్రామాలైన కిడిసింగి, తాడివాడ, గుళ్లలపాడు, నగరంపల్లి, పూండి గల్లి, వజ్రపుకొత్తూరు, రాజాంతో పాటు పలాస మండలంలోని అనేక గ్రామాల్లో ఉన్న సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఉంది. వజ్రపుకొత్తూరు పరిధిలో ఉన్న కొత్తూరు చెరువు, తాడివాడ పరిధిలో ఉన్న కొత్త చెరువు, కిడిసింగి పరిధిలో ఉన్న ఎర్ర చెరువు, నర్సుల చెరువు, గంగా సాగర్, కొనేరుతో పాటు అనేక చెరువులకు వంశధార నీరు అందక వెలవెలబోతున్నాయి. దీంతో సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి శివారు గ్రామాలకు వంశధార నీరు అందించాలని కోరుతున్నారు.

వంశధార నీరు అందించండి

వంశధార నీరు వస్తుందన్న ఆశతో పంట సాగుకు సిద్ధం అయ్యాం. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. ప్రస్తుతం వర్షాల్లేవు. మరో వైపు వస్తుందనుకున్న వంశధార నీరు రాలేదు. దీంతో నారు మడులు ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి వంశధార నీరు అందించాలి.

నర్సు కేశవరావు,
రైతు, కిడిసింగి, వజ్రపుకొత్తూరు మండలం

వరినాట్లు పడలేదు

సకాలంలో వర్షాలు లేక, వంశధార నీరు అందకపోవడంతో ఇంత వరకు వరినాట్లు పడలేదు. వంశధార నీరు అందిస్తామని పాలకులు హామీ ఇచ్చారు. కానీ నేటికీ శివారు భూములకు నీరు అందని పరిస్థితి. ఈ ఏడాది వరిసాగు ప్రశ్నార్థంగానే కనిపిస్తుంది. ఏటా ఎంతో ఆశతో పంటలను సాగు చేస్తున్నాం. కానీ తమకు చివరికి మిగిలేది కష్టాలు, కన్నీరే.

ఎన్.జోగారావు,
రైతు, వజ్రపుకొత్తూరు మండలం

జీవో 117 రద్దు చేయాలి



ఇచ్ఛాపురం రూరల్: ఎంఈవో అప్పారావుకు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు



పలాస:ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



సోంపేట: ఏంఈవోలకు వినతిపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



కవిటి:ఎంఈఓ ధనంజయమజ్జికి వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నేతలు

పలాస: ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఎమ్మార్సీ వద్ద ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఎంఈవో నిర్వహించిన ఉపాధ్యాయ పని సర్దుబాటు కార్యక్రమాన్ని బహిష్కరించారు. దీంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పాఠశాల విద్యాశాఖాధికారులు తలపెట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు కార్యక్రమం జీవో 53 ప్రాప్తికి చేయాలని, ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఇ.సిద్ధేశ్వరరావు, పూర్వపు జిల్లా కార్యదర్శి కె.రమేష్, రామన్నాయుడు, ప్రసాదరావు, కిశోర్‌కుమార్ పాత్రో, గొండు మధు ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయుల అసంబద్ధ సర్దుబాటును బహిష్కరిస్తున్నామని జాక్టో, ఫ్యాప్టో, పోటో సంఘ ప్రతినిధులు అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో కురమాన అప్పారావుకు వినత పత్రం అందజేశారు. వినత పత్రం అందించిన వారిలో జాక్టో ప్రతినిధులు కె.సోమేష్, ఎం.చంద్రశేఖరం, ఎస్.రాజు, పండి కృష్ణారావు, కె.సత్యమయ్య, బి.శంకరం ఉన్నారు.

సోంపేట: అసంబద్ధమైన జీవో 117ను రద్దు చేయాలని, ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించిన తర్వాతే పని సర్దుబాటు చేయాలని సోంపేట మండల ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారులు ఎస్.జోరాడు, జె.క్రిష్ణంరాజులకు వినతిపత్రాలను అందజేశారు. సంఘాల ప్రతినిధులు ఎస్.మోహనరావు, బి.ఈశ్వరరావు, ఎస్.కూర్మారావు, వై.దాలిబంధు, టి.చంద్రశేఖర్, జి.తిరుపతిరావు, కె.హరీష్, జి.రాజేష్, లోకనాథం పట్నాయక్, పురేంద్ర బిసాయి పాల్గొన్నారు.

కవిటి: ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియలో కచ్చితంగా ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలకు లోబడి నిర్వహించాలని ఫ్యాప్టో సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కవిటి ఎంఈవో ధనంజయమజ్జికి వినతిపత్రం అందించారు.

టెక్కలి: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని యూటీఎఫ్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఫ్యాప్టో సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిష్కరణ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలకాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.గణపతిరావు, టి.వైకుంఠరావు కోరారు.

మత్తుకు బానిస కావొద్దు



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో మానవహారం చేస్తున్న విద్యార్థినులు



కవిటి: ప్రతిజ్ఞ చేస్తున్న బాలబాలికలు



కవిటి: మొక్కలు నాటుతున్న కళాశాల సిబ్బంది



కాశీబుగ్గ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఎవరూ మత్తు పదార్థాలకు బానిస కావద్దని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర్‌రావు అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారిజీవితం దుర్భరంగా మారుతోందన్నారు. బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం నషాముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణను పరిశుభ్రం చేయడం, మొక్కలు నాటారు. డ్రగ్స్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మానవహారం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పి.సుధాకర్, రాజ్‌కుమార్, బాపూజీ, యుగంధర్, పి.ప్రసాద్, బి.కరుణాకర్, జనార్దన్ పాల్గొన్నారు.

కవిటి: మాదకద్రవ్యాలకు దూరంగా నిలిచి ఆరోగ్య భారతావని నిర్మాణానికి మనమంతా పాటుపడదామని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నినదించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ శ్రీవిద్యావాహిని జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యువత దినోత్సవంలో భాగంగా నషాముక్త్ భారత్ కార్యక్రమాన్ని పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు దూరంగా యువత ఉండాలన్నారు. సమాజం పట్ల బాధ్యత వ్యవహరించాలన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి అప్పారావు, డాక్టర్ తెప్పల క్రిష్ణమూర్తి, డాక్టర్ కుమార్‌నాయక్, వీరగట్టపు వెంకటరావు ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ కృషి



టెక్కలి: రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిత్య కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు

టెక్కలి: గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసిన కృషి ఎనలేనిదని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పితామహుడు రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అలాగే స్థానిక శాఖా గ్రంథాలయంలో కూడా గ్రంథాలయాధికారులు రూపాదేవి, వైకుంఠరావు, ప్రసాదరావు ఆధ్వర్యంలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

315 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కాశీబుగ్గ: పలాస క్యాజులాండ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉదయపురంలోని ఉలాసపేటవీధి వెంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సుమారు 315 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, సుగర్ పరీక్షలను చేసిన వైద్యులు రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, గురిటి శివాజీ, పలాస క్యాజులాండ్ వనిత అధ్యక్షురాలు తర్లానా శ్వేతకుమారి, కార్యదర్శి మల్లా సంతోషి, కోశాధికారి తూముల గాయత్రి, పూర్వ అధ్యక్షురాలు మల్లా జయశ్రీ, సభ్యులు పెంట మానస తదితరులు పాల్గొన్నారు.

పీఏ పంతులు మృతికి సంతాపం



పీఏ పంతులు (ఫైల్)

టెక్కలి: టెక్కలిలో తొలితరం జర్నలిస్టు పాలకోడేటి అపయ్యపంతులు (90) సోమవారం మృతి చెందారు. స్థానిక కొండ్రవీధిలోని తన స్వగ్రహంలో తుది శ్వాస విడిచారు. పీఏ పంతులు ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, టెక్కలి ప్రెస్‌క్లబ్‌కు గౌరవ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఈయన మృతిపై పలువురు జర్నలిస్టులతో పాటు సామాజిక, స్వచ్ఛ సంస్థల ప్రతినిధులు సంతాపం తెలియజేశారు.

రైతులకు న్యాయం చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పలాస: పలాస మండలం రామక్రిష్ణాపురం ఉజ్జిడి మెట్ట సమీపంలో ఉన్న రైతులకు న్యాయం చేయాలని వామపక్ష రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. పలాస రెవెన్యూ కార్యాలయంలో బాధిత రైతులతో కలిసి ఆర్డీవో భరత్‌నాయక్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్ గణపతి, చాపర వేణుగోపాల్, మద్దిల వేణుగోపాల్, ఎం.వినోద్ తదితరులు మాట్లాడుతూ.. ఉజ్జిడి మెట్టకు ఆనుకొని ఉన్న భూములను కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు గొరకల బాలక్రిష్ణ, దమయంతి, లక్ష్మమ్మ, గంగమ్మ ఉన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ చూపాలి



పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న సివిల్ జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: ప్రత్యేకావసరాల పిల్లలను ఆదుకుంటామని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. సోమవారం కోటబొమ్మాళి భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల పిల్లల తల్లిదండ్రులతో ఆమె అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల అవసరాలపై తల్లిదండ్రులు, ఫిజియో థెరిపిస్టు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 లఖినేని విశ్వప్రతాప్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఫిజియోథెరిపిస్టు గేదెల కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలరావు

కాశీబుగ్గ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పలాసలో ఘనంగా సోమవారం జరుపుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు చాపర వేణుగోపాల్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలోని బెనారస్ విద్యావిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ విద్యార్థి సంఘంగా ఆవిర్భవించిందని అన్నారు. సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి, నాయకులు పవన్, జస్వంత్, రాహుల్, జీవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాధురిపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస మండలం జాతీయ రహదారి లక్ష్మీపురం టోల్ గేటు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పలాస హైవేలో ఆగి ఉన్న కారును మాధురి ఢీకొట్టిన విషయం తెలిసిందే ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో ఆగిఉన్న కారుని ఢీకొట్టానని మాధురి తెలిపింది. కారు యజమాని న్యాయవాది భార్య శైలజ కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. కాగా త్వరలోనే మాధురికి నోటీసులు జారీ చేస్తామని అన్నారు.

15న ఆర్డీఓ కార్యాలయం వద్ద జెండా పండుగ

కాశీబుగ్గ: స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు జెండా పండుగ నిర్వహించనున్నారు. ఈ విషయమై కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదలైంది. ఆర్డీవో, డివిజినల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ భరత్ నాయక్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారు.